సాక్షి
నంద్యాల
బుధవారం, 3, సెప్టెంబర్, 2025



మట్టిలో కలిసిపోతూ...

మరణిస్తూ మరొకరికి పునర్జన్మ ప్రసాదించే అవయవదానం అన్ని దానాల్లో కన్న గొప్పదిగా నిలుస్తోంది. దీనిపై అపోహలను తొలగిస్తూ జీవనదాన్ ట్రస్ట్ అవయవదానాన్ని ప్రోత్సహిస్తోంది. 8లో▸



5వ తేదీ వరకు వర్షాలే..

కర్నూలు(అగ్రికల్చర్): అల్పపీడనం ప్రభావంతో ఈనెల 5వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ శాస్త్రవేత్తలు తెలిపారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,625.59
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 78.438
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 69,241
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 69,039

న్యూస్‌రీల్

సుగంధం అరటిపై పరిశోధనలు



మహానంది వేదపండితులతో చర్చిస్తున్న శాస్త్రవేత్తలు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రం ఎంత ప్రసిద్ధో ఇక్కడ సాగు అయ్యే అరటి పంటకు కూడా అంతటి పేరు ఉంది. అందులో భాగంగా మహానంది సమీపంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ హేమాద్రి, డాక్టర్ దీప్తిలు మహానంది సుగంధం రకం పంటపై పరిశోధనలు చేస్తున్నారు. ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు మంగళవారం మహానంది ఆలయానికి చేరుకొని వేదపండితులు రవిశంకర అవధాని, తదితరులను కలిసి ఇక్కడ పండే అరటికి మహానంది ఆలయానికి ఏదైనా అవినాభావ సంబంధం ఉందా అన్న కోణంలో ఆరా తీశారు. కాగా మహానంది మండలంలో సాగు అయ్యే సుగంధం అరటి రకం పూర్వం నల్లమల అడవిలోనే ఉండేదని, అక్కడి నుంచే పంట పుట్టిందని పెద్దల అభిప్రాయం. పూర్తిస్థాయిలో పరిశోధనలు చేసి సుగంధం అరటికి జియో ట్యాగింగ్ వచ్చేందుకు ప్రయత్నిస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ పంటకు సంబంధి ఏదైనా సమాచారం ఉంటే మహానంది ఉద్యాన పరిశోధనా స్థానాన్ని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు

ఉర్దూ వర్సిటీ పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ పీఎస్ షావలి ఖాన్, రిజిస్ట్రార్ లోకనాథ్

కర్నూలు కల్చరల్ : డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీలో గత ఏప్రిల్ నెలలో జరిగిన పీజీ రెండు, నాలుగో సెమిస్టర్ ఫలితాలను మంగళవారం ఇన్‌చార్జ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పీఎస్ షావలి ఖాన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ్ విడుదల చేశారు. ఎంఏ ఉర్దూ, ఎంఏ ఇంగ్లీష్, ఎంఏ ఎకనామిక్స్, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఎమ్మెస్సీ బాటనీ, ఎమ్మెస్సీ జువాలజీ, ఎమ్మెస్సీ, ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ, ఎంబీఏ, ఎంసీఏ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు రిజిస్ట్రార్ పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ https:// ahuuk. ac. in/ నుంచి పొందగలరని తెలిపారు. ఫలితాల విడుదలకు కృషి చేసిన ఎగ్జామినేషన్ విభాగం సిబ్బందిని వారు అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మహబూబ్ బాషా, ఎగ్జామినేషన్ విభాగం సైన్స్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నబియా సుల్తానా, ఆర్ట్స్ కో–ఆర్డినేటర్ డాక్టర్ బి.వెంకటప్ప, సిబ్బంది బి.మురళి, మరియా ఖాతున్ పాల్గొన్నారు. .

4, 5 తేదీల్లో కర్నూలు మార్కెట్ యార్డుకు సెలవు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు 4, 5 తేదీల్లో సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. ఈనెల 4వ తేదీ వినాయక నిమజ్జనం, 5వ తేదీన మిలాద్–ఉన్–నబి ఉన్నందున మార్కెట్ యార్డుకు సెలవు ఉంటుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా రోజుల్లో మార్కెట్ యార్డులో ఉల్లిగడ్డలతో సహా ఎలాంటి పంటలను కొనుగోలు చేయడం జరగదన్నారు.

7న జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలను మూసివేయండి

కర్నూలు(అర్బన్): ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నియామకాలకు స్క్రీనింగ్ పరీక్ష నేపథ్యంలో ఈ నెల 7న ఆయా పరీక్ష కేంద్రాల పరిసరాల్లోని జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలను మూసి వేయాలని ఉప కార్మిక కమిషనర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయా పరీక్షలను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జిల్లాలోని వివిధ పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

19న పోస్టల్ కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు(అర్బన్): తపాల శాఖ కార్యాలయాల్లో ప్రజలకు అందించే సేవలకు సంబంధించిన ఫిర్యాదులను ఈ నెల 19న స్వీకరిస్తామని కర్నూలు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టు ద్వారా ఫిర్యాదులను పంపే వారు కవర్‌పై డాక్ అదాలత్ అని పెద్ద అక్షరాలతో రాసి ఈ నెల 15వ తేదీ లేదా అంతకు ముందే తమకు చేరేలా పంపాలన్నారు.



- జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ వర్ధంతి
- ఘనంగా నివాళులర్పించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు
- వివిధ సేవా కార్యక్రమాల నిర్వహణ
- పాల్గొన్న ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు



జూపాడుబంగ్లాలో వైఎస్సార్ విగ్రహం వద్ద నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త దారాసుధీర్, నాయకులు



కొలిమిగుండ్లలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, నాయకులు

రాజన్నా..నిను మరువం

బొమ్మలసత్రం: సంక్షేమ పాలనతో ప్రజల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చిన మహానేత వైఎస్సార్ దివికేగి 16 ఏళ్లు గడిచాయి. నేటికి ఆయనను, ఆయన పాలనను స్మరించుకుంటున్నారు. మా మది నిండా నీవే రాజన్నా అంటూ అభిమానం చాటుకుంటున్నారు. మంగళవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఊరూరా ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించి నీవే మాకు ఆదర్శమంటూ నినదించారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చిన మహనీయుడు వైఎస్సార్ అని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరులో డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. భారీ సంఖ్యలో అభిమానులు, నాయకులు తరలివచ్చి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిరస్మరణీయుడని, తండ్రి బాటలోనే తనయుడు వైఎస్ జగన్ నడుస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కర్నూలు డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి, ఉమ్మడి జిల్లాల జోనల్ ఇన్‌చార్జ్ శ్వేతారెడ్డి, నేతలు సుదర్శన్‌రెడ్డి, భీమేశ్వరరెడ్డి, లక్ష్మీరెడ్డి , కార్పొరేటర్లు, వైఎస్సార్ అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

☛ నంద్యాలలో మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిషోర్‌రెడ్డి స్వగృహంలో నిర్వహించిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ పరిశీలకురాలు ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, ఇసాక్‌బాషా, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్, ఏపీఎస్పీడీసీఎల్ మాజీ డైరెక్టర్లు మహానేత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని శ్రీనివాస సెంటర్, సాయిబాబానగర్, చామకాల్వ సర్కిల్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు భారీ పూల మాలలు వేసి జోహార్ రాజన్నా అంటూ నినదించారు. ఎమ్మెల్సీలు మాట్లాడుతూ దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా జనరంజక పాలన అందించి ప్రజల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చారన్నారు. మాజీ ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యాన్ని పేదల దరికి చేర్చిన గొప్ప నాయకుడు వైఎస్సార్ అని గుర్తు చేశారు.

☛ బనగానపల్లె నియోజకవర్గ పరిధిలోని కొలిమిగుండ్ల మండలంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. నాయకులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బనగానపల్లెలో పార్టీ మండలాధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి మహానేత పాలనను స్మరించుకున్నారు. కోవెలకుంట్ల పట్టణంలో ఏపీఎన్‌జీవో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గువ్వల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌కు నివాళులర్పించారు.

☛ ఆళ్లగడ్డ పట్టణంలోని నాలుగు రోడ్డు కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాఘవేంద్రారెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, అభిమానులు పాల్గొన్నారు.

☛ నందికొట్కూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ దారా సుధీర్ ఆధ్వర్యంలో మహానేతకు ఘన నివాళులర్పించారు. వైఎస్సార్ మరణాన్ని ప్రజలు ఇప్పటికీ జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజల హృదయాల్లో గూడుకట్టుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జగదీశ్వరరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ శివరామకృష్ణారెడ్డి, సర్పంచ్ జనార్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

☛ వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో నంద్యాల జీజీహెచ్‌లో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధురిగౌడ్ పాల్గొన్నారు.

☛ కల్లూరు మండలం పెద్దటేకూర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు హనుమంతురెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరయ్యారు.



కల్లూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నాయకులు



నంద్యాలలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, ఇసాక్‌బాషా, మాజీ ఎంపీ పోచా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, నాయకులు



ఆళ్లగడ్డలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, నాయకులు

అందరివాడు వైఎస్సార్

పాణ్యం:దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అందరివాడని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం కల్లూరు మండల పరిధిలోని శరీన్‌నగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాటమీద నిలబడే వ్యక్తిత్వం వైఎస్సార్ సొంతమన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో కొలువయ్యారన్నారు. రాయలసీమకు తలమానికమైన గోరుకల్లు జలాశయంతో ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారన్నారు. 1.92లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు గాలేరునగరి ద్వారా చిత్తూరు, అనంతపురం, కడప, నెల్లూరు జిల్లాలకు తాగునీరు అందిస్తున్న ఘనత ఆయనదేనన్నారు. రైతు భరోసాతో పాటు ఉచిత విద్యుత్‌ను అందించి అన్నదాతకు అండగా నిలిచారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్‌తో వైఎస్సార్‌సీపీ శ్రేణులను భయపెట్టాలని చూస్తోందన్నారు. 1979లోనే ఇలాంటి బుక్‌లను ఎన్నో చూశామని, భయపడే ప్రసక్తే లేదన్నారు. అన్నింటికీ స్వస్తి పలికి ప్రజల కోసమే జీవిస్తున్నామన్నారు. పార్టీ శ్రేణులకు అన్నివిధాల అండగా నిలుస్తామని భరోసా కల్పించారు.

ప్రతిభకు పురస్కారాలు

నంద్యాల: చిన్నటేకూరు అంబేడ్కర్ అకాడమీలో చదివి ఎంబీబీఎస్ సీట్లు సాధించిన ఇద్దరు జిల్లా విద్యార్థులకు జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా రూ.లక్ష చొప్పున నగదు పురస్కారం, మెమోంటో అందజేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా గడివేముల మండలం ఎల్‌కే తండాకు చెందిన నికేష్‌నాయక్, కొత్తపల్లి మండలం నందికుంట గ్రామానికి చెందిన ప్రణయ్‌లు చిన్నటేకూరు అంబేడ్కర్ అకాడమీలో చదువుకొని ఎంబీబీఎస్ సీట్లు సాధించడం అభినందించదగ్గ విషయమన్నారు. గ్రామీణ విద్యార్థులు మరింతగా రాణించేందుకు ఈ విజయాలు ప్రేరణ ఇస్తాయన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీదేవి, చిన్నటేకూరు అకాడమీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్, అకాడమీ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరప్ప, మాజీ చైర్మన్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ రాజకుమారి

యూరియా సరఫరాలో కూటమి సర్కారు విఫలం

- ఎమ్మెల్సీ కల్పలతరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ధ్వజం

ఆళ్లగడ్డ: రైతులకు యూరియా సరఫరా చేయడంలో కూటమి సర్కారు పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ నంద్యాల పార్లమెంట్ పరిశీలకురాలు, ఎమ్మెల్సీ కల్పలతరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ధ్వజమెత్తారు. యూరియా కొరతపై రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా మంగళవారం వారు అహోబిలం గ్రామంలో పర్యటించారు. అక్కడ రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశమై మాట్లాడారు. కూటమి సర్కారుకు రైతుల సంక్షేమం పట్టదన్నారు. కనీసం పంటలకు అవసరమైన ఎరువులు కూడా అందించడం లేదన్నారు. రాష్ట్రానికి సరిపడా యూరియా ఇచ్చామని కేంద్రమంటుంటే.. రాలేదని రాష్ట్ర ప్రభుత్వం బుకాయిస్తుందన్నారు. వచ్చిన యూరియా ఎక్కడకు పోయిందో కూటమి సర్కారు చెప్పాలన్నారు. అవసరం మేరకు యూరియా అందిస్తే రైతులు రోడ్లమీదకు ఎందుకు వస్తారని సర్కారును నిలదీశారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఐదు సంవత్సరాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు సరఫరా చేశామన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదన్నారు. పార్టీ ఆదేశాల మేరకు యూరియా కొరత, రైతాంగ సమస్యలపై ఈ నెల 6వ తేదీ నంద్యాల ఆర్డీవోను కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ ప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ కశెట్టి నాగేశ్వర్ రావు తదితరులున్నారు



రైతులతో సమావేశమైన ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

అంతా హడావుడే !

- మంగళవారం తెల్లవారుజామున డీఎస్సీ అభ్యర్థులకు కాల్‌లెటర్లు
- వెనువెంటనే ఆర్‌యూలో వెరిఫికేషన్
- నాన్ లోకల్ అభ్యర్థులకు నేడు ..

కర్నూలు (సిటీ): డీఎస్సీ అభ్యర్థులు పరీక్షల షెడ్యూల్ విడుదల అయినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతిరోజూ టెన్షన్ గానే గడపాల్సిన పరిస్థితి . కోర్టు ఆదేశాలతో మెరిట్ జాబితాలు వచ్చినా కూడా సెలెక్షన్ మెరిట్ రోస్టర్ కట్ ఆఫ్ జాబితా విడుదల చేయకుండా డీఎస్సీ వెరిఫికేషన్ చేయడంతో అభ్యర్థుల్లో అనుమానాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. గత నెల 28, 29 తేదీల్లో డీఎస్సీకి ఎంపిక అవుతారనుకునే వారికి కాల్ లెటర్లు పంపించి రెండు రోజుల పాటు సర్టిఫికెట్ల పరిశీలన చేశారు. ఇందులో కొందరికి సాంకేతిక కారణాలతో కాల్ లెటర్లు వెళ్లలేదు. మంగళవారం తెల్లవారుజామున హడావుడిగా 70 మందికి కాల్ లెటర్లు పంపించి అదేరోజు రాయలసీమ విశ్వవిద్యాలయంలోని గ్రంథాలయ భవనంలో జరిగే రెండో విడత డీఎస్సీ పత్రాల పరిశీలనకు రావాలన్నారు. వీరిలో 49 మంది సర్టిఫికెట్లు పరిశీలన పూర్తి కాగా ఇంకా 21 మంది మిగిలారు. నాన్‌లోకల్ అభ్యర్థులైన వీరి సర్టిఫికెట్లను నేడు పరిశీలించనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. అలాగే రెండో విడతలో కాల్‌లెటర్లు వచ్చిన వారిలోని 19 మంది దివ్యాంగులకు కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో బుధవారం వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు సమాచారం.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

గోస్పాడు: పీహెచ్‌సీల పరిధిల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యులు తగు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ ఆదేశించారు. నంద్యాల పట్టణంలోని సర్వజన ఆసుపత్రి ఎంసీహెచ్ బ్లాక్ సమావేశ భవనంలో జిల్లా మలేరియా నివారణ అధికారి చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు రోగాలు ప్రబలే అవకాశం అధికంగా ఉంటుందన్నారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధుల విషయంలో ముందు జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.అలాగే వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన వైద్య సేవలు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్, జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కాంతరావునాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్‌రావు

కర్నూలు సర్కిల్ ఎస్‌ఈకి అదనపు బాధ్యతలు



బి.బాల చంద్రారెడ్డి

కర్నూలు సిటీ: జల వనరుల శాఖ కర్నూలు సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్‌గా పని చేస్తున్న బి.బాల చంద్రారెడ్డికి శ్రీశైలం డ్యాం నిర్వహణ పర్యవేక్షక ఇంజనీర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీశైలం డ్యాం నిర్వహణ పర్యవేక్షక ఇంజనీర్ పోస్టు రెండున్నర నెలలుగా ఖాళీగా ఉంది. జూన్ నెలలో అక్కడ పర్యవేక్షక ఇంజనీర్‌గా పని చేస్తున్న పి.శ్రీరామచంద్రమూర్తి పదోన్నతిపై కడప ప్రాజెక్ట్స్ సీఈగా వెళ్లారు. అప్పటి నుంచి ఆయన అదనపు బాధ్యతలు నిర్వహిస్తూ గత నెల 31న పదవీ విరమణ పొందారు. దీంతో ఆ స్థానంలో బి.బాల చంద్రారెడ్డికి అదన పు బాధ్యతలు అప్పగించారు.

శ్రీశైల దేవస్థానం భద్రతపై ప్రత్యేక దృష్టి



దేవస్థాన కమాండ్ కంట్రోల్ రూంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఎస్‌ఓ శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఆ దేవస్థాన నూతన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాసరావు అన్నారు. దేవస్థాన సీఎస్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మంగళవారం దేవస్థానంలోని భయ దేవాలయాల్లో క్యూలైన్లను, కంపార్ట్‌మెంట్లను పరిశీలించారు. అలాగే కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. అక్కడ సిబ్బంది విధులను అడిగి తెలుసుకున్నారు. అలాగే టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీలను పరిశీలించి పలు సూచనలు చేశారు. సెక్యూరిటీ సిబ్బంది రోల్‌కాల్‌ను పరిశీలించి భక్తులతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. అనంతరం మీడియాతో సీఎస్‌ఓ మాట్లాడుతూ అందరి సహకారంతో క్షేత్ర భద్రతకు అవసరమైన చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఇండియన్ ఆర్మీలో జూనియర్ కమిషన్ అధికారి హోదాలో పనిచేసి పదవీ విరమణ చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

లక్ష్యం దిశగా అడుగులేయాలి

● అంతర్జాతీయ క్రికెటర్ అంజలి శర్వాణి



అంతర్జాతీయ క్రికెటర్ అంజలి శర్వాణిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తే విజయం సొంతమవుతుందని అంతర్జాతీయ క్రికెటర్ అంజలి శర్వాణి సూచించారు. ఆరెకల్లు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో అంజలి శర్వాణి మాట్లాడుతూ తాను ఈ స్థాయికి రావడానికి గురువుల శిక్షణతో పాటు తల్లిదండ్రుల సహకారం ఎంతో ఉందన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనాలన్నారు. క్రీడల పేరుతో చదువును నిర్లక్ష్యం చేయరాదన్నారు. అనంతరం అంజలి శర్వాణిని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమములో వ్యాయామ ఉపాధ్యాయుడు మహేంద్ర పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

డోన్ టౌన్: పట్టణంలోని రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం-3పై గుర్తుతెలియని వ్యక్తి (36)మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ బిందుమాధవి మంగళవారం తెలిపారు. కొద్ది రోజులుగా రైల్వే స్టేషన్ చుట్టు పక్కల తిరిగుతండేవాడని, అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని ఎస్ఐ తెలిపారు. మృతుదేహాన్ని స్థానిక ఆసుపత్రికి తరలించామన్నారు. వివరాలు తెలిసిన వారు స్థానిక రైల్వే స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

యూరియా స్వాధీనం



హాలహర్వి: ఆస్పరి నుంచి కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా ఆటోలో తరలుతున్న యూరియాను క్షేత్రగుడి చెక్‌పోస్టు వద్ద మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి రశీదులు లేకపోవడంతో డ్రైవర్‌ను విచారిస్తున్నారు.



అలుగు పారింది.. చేప చిక్కింది

ఓ వైపు జల సవ్వడులు.. మరో వైపు చిన్నారుల జలకాలాటలు.. ఇంకో వైపు చేపల వేట.. ఆ దృశ్యాలు ఆ చెరువు అలుగు వద్ద ఆకట్టుకుంటున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మంచాలకట్ట చెరువు నిండి అలుగు ఎక్కి పారుతోంది. కొందరు అక్కడికి చేరుకుని సరదాగా ఈత కొడుతూ గడుపుతుండగా.. మరి కొందరు వలలతో చేపలు పడుతూ కనిపించారు.

– గడివేముల

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచండి



ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయంలో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకునేందుకు, నాణ్యమైన దిగుబడులు పొందేందుకు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. మంగళవారం మద్దూరునగర్‌లోని ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో భూమి సారవంతమవుతుందన్నారు. ఫలితంగా దిగుబడులు నాణ్యతతో ఉంటాయన్నారు. విచ్చిలవిడిగా రసాయన ఎరువులు వాడటం వల్ల భూమి ఆరోగ్యం దెబ్బతిని, పంటలకు చీడపీడల బెడద పెరుగుతోందన్నారు. నేలను సారవంతం చేసేందుకు ఘన, ద్రవ జీవామృతంతో పాటు నవధాన్యాలు సాగు చేయాలని సూచించారు. ప్రధాన పంటల్లో అంతరపంటలు సాగు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో విశేషంగా రాణిస్తున్న 12 మందికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. సమావేశంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మాధురీ, సీనియర్ కన్సల్టెంట్ రాజేశ్వర్, జిల్లా కన్సల్టెంట్ లక్ష్మయ్య, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

మట్టిలో కలిసిపోతూ మరికొందరికి జీవితాన్నిస్తూ!

- అవయవ దానం పట్ల పెరుగుతున్న అవగాహన
- కర్నూలు జీజీహెచ్, రెండు ప్రైవేటు ఆసుపత్రులకు అవయవ మార్పిడికి అనుమతి
- బ్రెయిన్ డెడ్ తర్వాతే అవయవాల సేకరణ



ఎవరైనా ఓ వ్యక్తి మరణించినా అతని గుండె స్పందిస్తుంది. ఊపిరితిత్తులు శ్వాసిస్తుంటాయి. నేత్రాలు వీక్షిస్తుంటాయి. మూత్రపిండాలు మరొకరిలో రక్త శుద్ధి చేస్తూనే ఉంటాయి. మరణించిన వ్యక్తి మన మధ్య లేకపోయినా అతని శరీరంలోని అవయవాలు మరొకరికి పునర్జన్మను ప్రసాదిస్తున్నాయి. మట్టిలో కలిసిపోతూ అవయవదానంతో మరొకరి జీవితాన్ని నిలుపుతుండటంతో ప్రస్తుతం అన్ని దానాల్లో కన్నా అవయవదానం గొప్పదిగా నిలిచింది. అవయవదాన అవగాహనపై ప్రత్యేక కథనం.

కర్నూలు(హాస్పిటల్): అవయవదానమంటే ఇప్పటికీ చాలా మందిలో అపోహలున్నాయి. మన అవయవాలను బతికున్నప్పుడే సేకరించి ఇతరులకు అమరుస్తారని కొందరు, మరణించాక అవయవాలను తీస్తే వచ్చే జన్మలో సంబంధిత అవయవాలు లేకుండా జన్మిస్తారన్న మూఢనమ్మకంతో మరికొందరు అవయవదానానికి ముందుకు రావడం లేదు. ఇలాంటి అపోహలను ఒకవైపు జీవనదాన్ ట్రస్ట్, మరోవైపు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలు తమ వంతుగా అవగాహన కల్పిస్తున్నాయి. ఈ మేరకు ఇటీవల కాలంలో అవయవదానం చేయడానికి చాలా కుటుంబాలు ముందుకు వస్తున్నాయి. ఈ మేరకు దాతలు ముందుకు వచ్చి తమ శరీర భాగాలను మరణానంతరం దానం చేసేందుకు అంగీకార పత్రాలు ఇస్తున్నారు. మరికొందరు వివిధ ప్రమాదాలు, అనారోగ్యాల సందర్భంగా బ్రెయిన్ డెడ్ కావడంతో వారి కుటుంబ సభ్యుల అనుమతితో వారి అవయవాలను సేకరిస్తున్నారు. మరికొందరు రక్తసంబంధీకుల కోసం వారి అవయవాలను దానం చేస్తున్నారు. ఈ మేరకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు కర్నూలు కిమ్స్ హాస్పిటల్, మెడికవర్ హాస్పిటల్‌లకు అవయవాల సేకరణ, మార్పిడిలకు అనుమతి లభించింది. ఈ మేరకు ఆయా ఆసుపత్రుల్లో అవయవదాన, మార్పిడి ఆపరేషన్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రామాంజనేయులు, ఎస్తేరిరాణి, మల్లికార్జున, ఈరన్న, గిరిధర్‌లకు కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేశారు.

జీవన్‌దాన్ ట్రస్ట్ ద్వారా అవగాహన

అవయవదానాలనుప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆధ్వర్యంలో జీవన్‌దాన్ ట్రస్ట్ పనిచేస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల సమాచారాన్ని ఈ ట్రస్ట్‌కు అందిస్తే వారు అవయవాలను సేకరించి అవసరం ఉన్న రోగులకు అమరుస్తారు. అయితే ఎవ్వరికైనా అవయవాలు కావాల్సి వస్తే ముందుగా ఈ ట్రస్ట్‌లో పేరు నమోదు చేసుకోవాలి. ప్రాధాన్యత క్రమాన్ని బట్టి సేకరించిన అవయవాలను నిపుణుల పర్యవేక్షణలో అవసరమైన వారికి అమరుస్తారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోనూ జీవన్‌దాన్ ట్రస్ట్ ప్రతినిధులను ఏర్పాటు చేశారు. వీరు ఎవరైనా బ్రెయిన్‌డెడ్ అయితే వారి కుటుంబ సభ్యులను అవయవదానానికి ఒప్పిస్తారు. కానీ ఇప్పటికీ చాలా మందికి బతికున్నప్పుడు అవయవాలను సేకరిస్తారనే అపోహ ఉంది. ఇది తప్పు. జీవించిఉన్నప్పుడు అవయవాలు తీయరు.

కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతం

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇటీవల చేసిన కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతం అయినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆసుపత్రిలో ఇప్పటి వరకు ఐదుగురికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు నిర్వహించినట్లు తెలిపారు. కిడ్నీతో పాటు గుండె, ఊపిరితిత్తుల మార్పిడికి సైతం అనుమతి వచ్చిందన్నారు. త్వరలో ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

లక్ష మందితో అంగీకార పత్రాలు



రక్తదానం, నేత్రదానంతో పాటు బ్రెయిన్‌డెడ్ అయిన వారి నుంచి అవయవాలను సేకరించి ఇతరులకు అమర్చేందుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా అవసరమైన క్యాంపెయిన్ చేస్తున్నాము. ఇప్పటికే 30వేల మందితో అంగీకార పత్రాలు తీసుకున్నాము. జిల్లాలో లక్ష మందితో అంగీకార పత్రాలు తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. యూరప్ దేశాల్లో మాదిరిగా ఇక్కడ కూడా బ్రెయిన్‌డెడ్ అయిన వారికి ప్రత్యేక ఐసీయూ ఉంటే బాగుంటుంది.

–డాక్టర్ కేజీ. గోవిందరెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్, కర్నూలు

బాధితులకు కొత్త జీవితం



బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి మాత్రమే అవయవాలను సేకరించి ఇతరులకు అమరుస్తారు. కిడ్నీలైతే బ్రెయిన్ డెడ్ అయిన వారి(కెడావర్),జీవించి ఉన్న వ్యక్తుల(లైవ్) నుంచి ఒక కిడ్నీని సేకరించి అవసరమైన వారికి అమరుస్తారు. ఇలా కిడ్నీ ఆపరేషన్ చేయించుకున్న వారు కొంత కాలం పాటు ఇన్‌ఫెక్షన్ రాకుండా జాగ్రత్త పడితే జీవితాంతం హాయిగా జీవించవచ్చు.

–డాక్టర్ అబ్దుల్ సమద్, యురాలజిస్టు, కర్నూలు

అవయవదానానికి ఒప్పిస్తున్నాము



నేను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మేల్ స్టాఫ్‌నర్సుగా విధులు నిర్వహిస్తూ 2023లో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ కో ఆర్డినేటర్‌గా శిక్షణ పొందాను. ఇప్పటి వరకు ఐదుగురికి ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్‌లో అవయవాలు ఇచ్చేలా వారి కుటుంబాలను కౌన్సిలింగ్ చేసి ఒప్పించాము. ఒక బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి ద్వారా సేకరించిన అవయవాలతో 8 మంది జీవితాలలో వెలుగు నింపవచ్చు.

–టి.సంపత్, మేల్ స్టాఫ్‌నర్సు, జీజీహెచ్, కర్నూలు

ఏడి ‘పింఛన్’

- ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీ ఉత్తిదే
- సచివాలయాల వద్ద లబ్ధిదారుల పడిగాపులు



పింఛన్ కోసం సచివాలయం వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు

కోవెలకుంట్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామ సచివాలయాలు, ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులతో లబ్ధిదారులకు ఇళ్ల వద్దే పింఛన్లు అందజేస్తున్నామని గొప్పలు చెబుతోంది. కొన్నిచోట్ల ఆచరణలో అమలు చేయకపోవడంతో లబ్ధిదారులు పింఛన్ల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. కోవెలకుంట్ల మేజర్ పంచాయతీలో సెప్టెంబర్ నెల పింఛన్లు తీసుకునేందుకు లబ్ధిదారులు రెండవ రోజు మంగళవారం అవస్థలు పడాల్సి వచ్చింది. కొందరు సిబ్బంది తొలిరోజున ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయకపోవడంతో రోజంతా ఎదురు చూసిన లబ్ధిదారులు.. మంగళవారం గ్రామ సచివాలయం వద్దకు చేరుకుని పడిగాపులు కాశారు. ఉదయం 10 గంటల తర్వాత సిబ్బంది గ్రామ సచివాలయంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయడంతో అక్కడి నుంచి ఇళ్లకు వెళ్లిపోయారు.

దైవదర్శనానికి వెళ్తూ తిరిగిరాని లోకాలకు..

- ఆటో బోల్తా పడి మహిళ దుర్మరణం
- మరో ముగ్గురికి గాయాలు



లలితమ్మ (ఫైల్)



బోల్తా పడిన ఆటో

మద్దికెర: దైవదర్శనానికి వెళ్తున్న ఓ మహిళ ఆటో బోల్తా పడిన ఘటనలో తిరిగిరాని లోకాలకు చేరుకున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మద్దికెరకు చెందిన లలితమ్మ(55)తోపాటు పలువురు అరుణాచలం దేవస్థానానికి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా మంగళవారం మద్దికెర నుంచి గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు రెండు ఆటోల్లో బయలుదేరారు. రైల్వే స్టేషన్ సమీపంలోని మలుపు వద్ద ఓ ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో నలుగురు మహిళలు గాయపడడంతో చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. లలితమ్మ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి భర్త శ్రీనివాసులు, ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

మహిళ ఆత్మహత్య

నందికొట్కూరు: మండల పరిధిలోని బ్రాహ్మణ కొట్కూరు గ్రామానికి చెందిన కుర్వ రాజేశ్వరి(34) ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ తిరుపాల్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కుర్వ వెంకటలక్ష్మమ్మ, కృష్ణమూర్తి దంపతుల కూతురు రాజేశ్వరికి మానసికస్థితి సరిగా లేదు. భర్త సుధాకర్, తల్లి వెంకటలక్ష్మమ్మ కర్నూలుకు పని నిమిత్తం వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లఎస్ఐ తెలిపారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

- రూ. 6.83 లక్షల విలువ చేసే ఎరువుల విక్రయాల నిలిపివేత



ఎమ్మిగనూరులో తనిఖీలు నిర్వహిస్తున్న ఏఓ ఎం.శివశంకర్, టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని సాయిరాం సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో మంగళవారం మండల వ్యవసాయాధికారి మదిరెపల్లి శివశంకర్, పట్టణ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తనిఖీలు నిర్వహించారు. ఎరువుల అమ్మకాలు, రికార్డులు, పురుగు మందులను పరిశీలించారు. మాట్లాడుతూ దుకాణంలోని రికార్డులను, స్టాక్‌ను పరిశీలించగా ‘ఓ’ ఫామ్ ఇన్‌క్లూడ్ చేయకుండా మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించి రూ.6,83,303 విలువ చేసే 13.129 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలు నిలిపేశారు. డీలర్లు ఓ ఫామ్ ఇంక్లూడ్ చేయకుండా రసాయన, పురుగు మందుల ఎరువుల విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ శివశంకర్ హెచ్చరించారు.

కోడుమూరులో..



కోడుమూరులో ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కోడుమూరు రూరల్: స్థానిక ఎరువుల దుకాణాలపై ఎస్ఐ ఎర్రిస్వామి తన సిబ్బందితో మంగళవారం దాడులు నిర్వహించారు. ఎరువుల దుకాణాల్లోని స్టాక్, సేల్స్ రికార్డులతోపాటు గోదాముల్లోని ఎరువుల నిల్వలను పరిశీలించారు. యూరియా, ఇతర ఎరువులను బ్లాక్ చేసి, అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణదారుల రికార్డులను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా రికార్డులను స్వాధీనం చేసుకోవడాన్ని నిరసిస్తూ ప్రైవేట్ ఏజెన్సీలు, దుకాణదారులు తమ దుకాణాలను మూసివేసి నిరసన తెలిపారు. ఎన్నడూ లేని విధంగా ఎరువుల దుకాణాల్లో పోలీసుల సోదాలు ఏమిటని వాపోయారు.

రూ.6.39 లక్షల ఎరువుల సీజ్



యూరియా బస్తాలను సీజ్ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

మంత్రాలయం/కర్నూలు: అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువుల గుట్టు రట్టయ్యింది. విజిలెన్స్ దాడుల్లో రూ.6,39,800 విలువైన ఎరువులు సీజ్ చేసి, ఒక ఒక దుకాణంపై 6ఎ కేసు నమోదు చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆదోని, మంత్రాలయం, ప్యాపిలి ప్రాంతాల్లో మంగళవారం విజిలెన్స్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. మంత్రాలయం మండలం కాచాపురం గ్రామంలోని శ్రీరామ్ ట్రేడర్స్, గురురాజ ట్రేడర్స్‌లో అక్రమంగా 300 బస్తాల యూరియా, 400 బస్తాల 20:20:0:13 రకం ఎరువులను నిల్వ చేశారు. మంగళవారం రాత్రి విజిలెన్స్ ఎస్ఐ వెంకట ప్రసాద్, డీసీటీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. రూ.79,800 విలువ జేసే యూరియా, రూ.5.60 విలువైన 20:20:0:13 ఎరువులను గుర్తించి సీజ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో ఓ వైపు యూరియా దొరక్క రైతులు నానా అవస్థలు పడుతున్నారు. అయితే హోల్‌సేల్ డీలర్ ఇంత మొత్తంలో యూరియాను నిల్వ ఉంచడం గమనార్హం. దాడుల్లో స్థానిక సీఐ రామాంజులు, మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్, వ్యవసాయాధికారి గణేష్, ఎంపీఈఓ బసవ పాల్గొన్నారు.

గ్రేడింగ్ పేరుతో రైతుకు అన్యాయం



కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లికి మద్దతు ధర కల్పిస్తున్నామంటూనే గ్రేడింగ్ పేరుతో ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేస్తోంది. ఓ రైతు మంగళవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు 95 ప్యాకెట్ల ఉల్లి తెచ్చాడు. ఉల్లిలో నాణ్యత లేదని నాలుగు సార్లు గ్రేడింగ్ చేయించి 35 ప్యాకెట్లు పక్కన పోశారు. మిగతా 60 ప్యాకెట్లకు మాత్రమే మద్దతు ధర రూ.1,200 చొప్పున మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేశారు. ఇష్టారాజ్యంగా గ్రేడింగ్ చేయిస్తుండటం వల్ల మద్దతు ధర కల్పించినా ప్రయోజనం లేదని రైతులు వాపోతున్నారు. ఉల్లిలో నాణ్యత ఉండాల్సిందేనని, అయితే ఒకసారి గ్రేడింగ్ చేయిస్తే సరిపోతుందని, మూడు, నాలుగు సార్లు గ్రేడింగ్ చేయిస్తుండటం సరికాదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ మద్దతు ధరతో ఉల్లి కొనుగోలు చేయాలంటే ముందుగా ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులు నాణ్యతను ధ్రువీకరించాలి. నాణ్యత లేకపోతే గ్రేడింగ్ చేయించాలి. అయితే ఎక్కువ సార్లు గ్రేడింగ్ చేయించడం వల్ల రైతులు నష్టపోవాల్సి వస్తోంది.